AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
24-7-2026 (Friday)
MAIN EDITION

## విమానయాన రంగంలోకి అదానీ గ్రూప్.. సంస్థ క్లారిటీ




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కొత్త విమానయాన సంస్థను ప్రారంభించనున్నట్లు వస్తున్న వార్తలను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అధికారికంగా ఖండించింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఇచ్చిన ఫైలింగ్‌లో స్పష్టతనిచ్చింది. తాము ఎయిర్‌లైన్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు ఎలాంటి ప్రతిపాదనను పరిశీలించడం లేదని, మీడియాలో వస్తున్న కథనాలు పూర్తిగా నిరాధారమైనవి , వాస్తవానికి దూరంగా ఉన్నాయని కంపెనీ పేర్కొంది. గౌతమ్ అదానీ నేతృత్వంలోని ఈ సంస్థ కొత్త విమానయాన సేవలను ప్రారంభించే అవకాశాలను అన్వేషిస్తోందంటూ కొద్ది రోజులుగా జాతీయ మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో అదానీ గ్రూప్ ఈ క్లారిటీ ఇచ్చింది.

## జనావాసాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు : సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు చెప్పారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని సీజేపీ స్పష్టం చేసింది. విద్యార్థుల భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. విద్యా వ్యవస్థ క్షీణించడం వల్లే దేశంలో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

## నష్టాల్లో ముగిసిన సూచీలు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరసగా ఐదో రోజూ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల నేపధ్యంలో బిఎస్ఈ సెన్సెక్స్ 331 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 102 పాయింట్లు కోల్పోయింది. ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడుల తరలింపు ఇన్వెస్టర్ల సెంటిమెంట్ను దెబ్బతీశాయి.

## సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**అక్షరటుడే, ఢిల్లీ :** ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారమయ్యే కోర్టు కార్యకలాపాలను అనధికారికంగా ఉపయోగించడంపై సుప్రీం కీలక ఆదేశాలు జారీ చేసింది. అనుమతి లేకుండా సోషల్ మీడియాలో, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనైనా కోర్టు కార్యకలాపాలను పోస్ట్ చేయడం, సవరించడం, వ్యాప్తి చేయడం వంటివి చేయొద్దని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు.




# పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలు

నీట్ పేపర్ లీకేజీపై యువత ఆందోళన నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పేపర్ లీకేజీలకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు పడేలా బిల్లుకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసనల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం కేబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో బిల్లుకు ఆమోదం తెలిపారు.

-అక్షరటుడే, ఢిల్లీ

- నిందితులకు పదేళ్ల జైలు, రూ.కోటి జరిమానా!
- బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం

పరీక్షా పత్రాల లీకేజీలకు కఠినమైన శిక్షలను ప్రతిపాదిస్తూ ఒక బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ చట్టాన్ని వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. పరీక్షల మోసాలకు వ్యతిరేకంగా చట్టాలను ప్రభుత్వం పటిష్టం చేస్తుందని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల వంటి యంత్రాంగాల ద్వారా వేగవంతమైన విచారణకు నిబంధనలు చేర్చనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.

### పదేళ్ల జైలు శిక్ష

పేపర్ లీకేజీలకు పాల్పడే నిందితులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.కోటి జరిమానా విధించేలా బిల్లులో పొందుపరిచినట్లు సమాచారం. ప్రస్తుతం పేపర్ లీక్ కేసులో దోషిగా తేలిన వ్యక్తులకు 3 నుండి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. కొత్త బిల్లులో జైలు శిక్షను పదేళ్ల వరకు, జరిమానాను రూ.కోటి వరకు పెంచినట్లు తెలిసింది. కేబినెట్ ఆమోదం పొందడంతో ఈ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

### ముగిసిన చర్చలు

ఓ వైపు కేంద్రం, ప్రధాని విద్యార్థులకు హామీ ఇచ్చిన సీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నేతలు పేర్కొన్నారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులతో కేంద్రం చర్చలు జరిపింది. ఈ చర్చల్లో మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్లు సీజేపీ నాయకులు తెలిపారు. రెండు డిమాండ్లకు కేంద్రం పాజిటివ్‌గా ఉందన్నారు. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని కోరామని తెలిపారు. నిరసనకారులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం ఒప్పుకుందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని చెప్పామని తెలిపారు. అప్పటి వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు.



## ఎల్లుండి నుంచి తెలంగాణలో వానలు

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈ నెల 26 నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆరు రోజుల పాటు విస్తారంగా వానలు పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు పంటల సాగు పనులు మొదలు పెట్టారు. అయితే ఈ నెల 23 నుంచి 25 వరకు వర్షాలు తగ్గుముఖం పడుతాయని అధికారులు తెలిపారు. జులై 26 నుండి ఉత్తర, తూర్పు, పశ్చిమ, మధ్య తెలంగాణ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయి.

## గుజరాత్‌లో భారీ వర్షాలు

**అక్షరటుడే, గుజరాత్ :** గుజరాత్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వల్సాద్ జిల్లాలోని ఉంబర్‌గావ్ తాలూకాలో 36 గంటల వ్యవధిలో 1,200 మి.మీ వర్షపాతం నమోదు అయింది. వర్షాలకు నవసారి, వల్సాద్ జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సూరత్, అహ్మదాబాద్, ఖేడా, తాపి, డాంగ్స్ జిల్లాల్లోనూ బుధవారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వల్సాద్‌లో సుమారు 1,200 మందిని వరదలో చిక్కుకుపోగా అధికారులు రక్షించారు. నవసారి జిల్లాలోనూ 22 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పార్లమెంట్ ఆవరణలో విపక్షాల ఆందోళన



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా శుక్రవారం విపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ నినాదాలు చేశారు. ప్రధాని మోదీ స్పందించి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్నారు. అప్పటి వరకు తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నిరసనల్లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలు పాల్గొన్నారు.

## మోదీ జాగ్రత్తగా ఉండు : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** యువత కదం తొక్కారని, మోదీ జాగ్రత్తగా ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నేపాల్‌లో యువత తలుచుకుంటే ప్రభుత్వమే కూలిపోయిందని గుర్తు చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద యువత నిరసన తెలుపుతున్నారు. వారికి శుక్రవారం కేటీఆర్ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియా ఇచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే మోదీ పెట్టుకున్నారని అన్నారు. ఈ జనరేషన్ చావుకు భయపడే రకం కాదని చెప్పారు. కేంద్రంపై నిరసన కోసం వస్తుంటే మధ్యలో కాంగ్రెస్ వాళ్లు తమను అడ్డుకున్నారని తెలిపారు. బడే భాయ్ కోసం చోటే భాయ్ అడ్డం పడుతున్నారని విమర్శించారు.

## పార్టీ మార్పుపై క్లారిటీ ఇచ్చిన మల్లారెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** తాను ఏ పార్టీలోకీ మారడం లేదని, చివరి వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్పష్టం చేశారు. బోయిన్‌పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారాలకు తెరదించారు. అలాగే తాను పార్టీ మారుతున్నాననే వార్తలు విని ఒక బీఆర్ఎస్ కార్యకర్త తనకు రక్తంతో లేఖ రాయడంపై మల్లారెడ్డి స్పందించారు. ఆ లేఖ చూసి తనకు చాలా బాధ అనిపించిందన్నారు. అయితే ఆ ఉత్తరంలో చిరునామా రాయలేదని, ఆ కార్యకర్త ఎవరో కనుక్కొని తప్పకుండా అతని ఇంటికి వెళ్లి కలుస్తానని హామీ ఇచ్చారు.

## కుంకీ ఏనుగులకు స్వాగతం పలికిన పవన్ కల్యాణ్

**అక్షరటుడే, ఏపీ :** ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కుంకీ ఏనుగులకు అమరావతిలో ఘన స్వాగతం పలికారు. పార్వతిపురం మన్యం జిల్లాలో అడవి ఏనుగులు ఇటీవల బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ అడవి ఏనుగులను అదుపు చేసేందుకు కుంకీ ఏనుగులను మన్యం జిల్లాకు పంపాలని ఆదేశించారు. పలమనేరు ముసలిమడుగు క్యాంపు నుంచి బయలుదేరిన 'అభిమన్యు', 'జయంత్' అనే రెండు కుంకీ ఏనుగులకు మంగళగిరిలోని తన కార్యాలయం వద్ద శుక్రవారం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు.



## 60 దేశాలపై అమెరికా సుంకాలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి పలు దేశాలపై టారిఫ్‌లు విధించారు. 60 దేశాలకు కొత్త సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. భారత్ సహా 60 దేశాలపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ తెలిపారు. ట్రేడ్ యాక్ట్ 1974లోని 'సెక్షన్ 301' ప్రకారం కొత్త టారిఫ్‌లు అమలులోకి వస్తాయన్నారు. ఈ దేశాల నుండి దిగుమతులపై యునైటెడ్ స్టేట్స్ 10 శాతం నుండి 12.5 శాతం వరకు పన్నులు విధిస్తుంది. గతంలో ట్రంప్ విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన తాత్కాలిక పన్నులు విధించారు. వాటి గడువు నేటితో ముగియనుండటంతో మరోసారి పన్నులు విధిస్తున్నట్లు ప్రకటించారు.

## ప్రధాని మోదీ మన్ కీ బాత్ మానుకోవాలి: ఖర్గే



**అక్షరటుడే, ఢిల్లీ:** నీట్ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి సెల్ఫీ వీడియో విడుదల చేయడంపై రాజ్యసభాపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో తలెత్తిన కీలక సమస్యలపై స్పందించకుండా ప్రధాని వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఖర్గే.. ఏకపక్షంగా 'మన్ కీ బాత్' కార్యక్రమాలు నిర్వహించడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజల వాస్తవ సమస్యలపై స్పందించకుండా కేవలం ఉపన్యాసాలు ఇవ్వడానికే ప్రధాని పరిమితమయ్యారని ఆరోపించారు.

## సింగరేణి ఇతర రంగాలలోకి విస్తరించాలి



**అక్షరటుడే, ఖమ్మం :** సింగరేణిని పరిరక్షించడానికి, బలోపేతం చేయడానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో సీనియర్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. రాబోయే 1520 ఏళ్లలో ఇంధన రంగంలో అనేక మార్పులు రానున్నాయని భట్టి విక్రమార్క అన్నారు. సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్, పవన శక్తి, హైడ్రోజన్, అరుదైన ఖనిజాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వేగంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్, బొగ్గుపై ఆధారపడటం క్రమంగా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో సింగరేణి సంస్థ కూడా బొగ్గు తవ్వకాలకు మాత్రమే పరిమితం కాకుండా, అభివృద్ధి చెందుతున్న రంగాలలోకి విస్తరించాలని సూచించారు.

## నీట్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**అక్షరటుడే, ఢిల్లీ :** నీట్ పరీక్ష వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పేపర్ లీక్ తర్వాత సంస్కరణల పురోగతిపై నివేదిక కోరంది. వివరణాత్మక అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. నీట్ యూజీ పరీక్షకు సంబంధించి జరుగుతున్న 'తప్పుల పరంపరకు' ముగింపు పలకాలని, కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు మారేందుకు గల ప్రణాళికల వివరాలను తెలియజేయాలని ధర్మాసనం పేర్కొంది. నీట్ పేపర్ లీకుల అంశంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పి.ఎస్. నరసింహ, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం తాము ఈ విషయాన్ని చాలా నిశితంగా పర్యవేక్షిస్తామని, క్రమం తప్పకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపింది.